బ్యాంకర్లు లక్ష్యాలను చేరుకోవాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు

బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట, ఫిబ్రవరి 19: బ్యాంకర్లు తమకు కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలని, నిర్లక్ష్యం చేయొద్దని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్యాంకర్లతో డీసీసీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలతో పాటు ప్రాధాన్యత రంగాలకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలని అన్నారు. జిల్లా ప్రణాళికలో వార్షిక బడ్జెట్ రూ.8994.16 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, రూ.8023.84 కోట్ల లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. వార్షిక బడ్జెట్‌లో పంటల రుణాలలో రూ.2942.48 కోట్ల లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు రూ.3406.84 కోట్ల రుణాలు ఇచ్చి 115.78 శాతం వృద్ధి సాధించినట్లు చెప్పారు. దీర్ఘకాలిక వార్షిక బడ్జెట్‌లో రూ.2683.44 కోట్ల లక్ష్యం ఉండగా రూ.1916.66 కోట్ల లక్ష్యం సాధించారని, ప్రాధాన్యత రంగాల్లో రూ.7570.66 కోట్లు లక్ష్యానికి రూ.6344.08 కోట్లు సాధించినట్లు వెల్లడించారు. కొన్ని బ్యాంకులు రుణాలు అందించడంలో వెనుకంజలో ఉన్నాయని, వారికి కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు పంట రుణాల మంజూరులో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం బాపూజీ, ఆర్‌బీఐ ఏజీఎం రెహమాన్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ దినేశ్, జడ్పీ సీఈఓ అప్పారావు, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం సీతారాం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీటిని విడతల వారీగా అందించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

దాస్‌తండా వద్ద ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, ఫిబ్రవరి 19: ఎస్సారెస్పీ పరిధిలోని వ్యవసాయ భూములకు విడుతల వారీగా సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని దాస్‌తండా వద్ద ఉన్న ఎస్సారెస్పీ డీబీఎం-71ను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎక్కడెక్కడ సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారో గుర్తించి వారికి ప్రాధాన్యతగా సాగునీరు సరఫరా చేయాలన్నారు. మొదటి మూడు రోజులు సూర్యాపేట, ఆత్మకూర్(ఎస్), చివ్వెంల మండలాలకు, తర్వాతి మూడు రోజులు మోతె, పెన్‌పహాడ్, నడిగూడెం, మునగాల మండలాల పరిధిలోని భూములకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీబీఎం-22 ద్వారా మోతె మండలానికి సాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. నీటిపారుదల సీఈ రమేశ్‌బాబు, ఎస్ఈ శివధర్మతేజ, ఈఈ శ్రీనివాస్‌రావు, డీఈ రమేశ్, ఏఈలు ఉదయ్, లింగయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

వేసవిలో వ్యవసాయ, గృహ, నిర్మాణ రంగాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, ఎలాంటి అంతరాయం కలుగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రం జమ్మిగడ్డలోని ఎస్ఈ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలు ప్రతిరోజు ఎంత విద్యుత్‌ను వినియోగిస్తున్నారనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ బి.ఫ్రాంక్లిన్, డీఈ టెక్నికల్ దాలినాయుడు, ఏడీఈ కమర్షియల్ పి.అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి ఉండొద్దు..

రానున్న వేసవి కాలంలో ప్రజలకు తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం ఇమాంపేటలోని మిషన్ భగీరథ నీటి శుద్ధి 95 ఎంఎల్‌డీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. నీటిశుద్ధి కేంద్రం నుంచి మిషన్ భగీరథ తాగు నీరు సరఫరా నిరంతరం జరగాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్‌రెడ్డి, గ్రిడ్ ఈఈ శ్రీనివాస్‌రావు, డీపీఓ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతరలో కొనసాగిన రద్దీ

- నాలుగో రోజూ తండోపతండాలుగా భక్తులు
- నేటితో జాతర ముగింపు

స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

లింగమంతుల స్వామిని దర్శించుకుంటున్న మంత్రి

సూర్యాపేట టౌన్/చివ్వెంల, ఫిబ్రవరి 19: పెద్దగట్టు జాతరకు నాలుగో రోజైన బుధవారం కూడా భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 వరకు సుమారు మూడు లక్షలకు పైగా భక్తులు హాజరయ్యారని అంచనా. జాతర ముగింపు సందర్భంగా గంధ దీపం ఎత్తి నెలవారం జరిపించారు. పాలు పొంగించి లింగమంతుల స్వామి, చౌడమ్మ, దేవరపెట్టె, పోతరాజులకు నైవేద్యం పెట్టారు. అనంతరం మంగళవారం రోజు వేసిన చంద్రపట్నంపై ఉన్న పసుపు, కుంకుమలను ఎత్తి గుట్టపై ఉన్న నాగిని పుట్టపై పోశారు. చౌడమ్మకు రెండు జంతువులను బలిచ్చి దేవరపెట్టెను సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి తరలించారు. నేడు గురువారం జాతర అధికారికంగా ముగియడంతో పాటు ఆలయ హుండీలను లెక్కించనున్నట్లు అధికారులు తెలిపారు.

స్వామిని దర్శించుకున్న ప్రముఖులు..

లింగమంతుల స్వామిని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, మందుల సామేల్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. రూ.60 కోట్లతో పెద్దగట్టుకు ఘాట్ రోడ్డు, గెస్ట్‌హౌస్‌లు నిర్మిస్తామని తెలిపారు.

జాతర సరళిని పరిశీలించిన ఐజీ..

పెద్దగట్టును మల్టీజోన్ 2 ఐజీ సత్యనారాయణ బుధవారం సందర్శించి లింగమంతుల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌తో కలిసి సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జాతర సరళిని పరిశీలించడంతో పాటు పోలీస బందోబస్తు, పార్కింగ్, వాహనాల మళ్లింపును పరిశీలించారు.

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఎన్నిక చెల్లదు

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ చైర్మన్ భూలోకరావు

సూర్యాపేట టౌన్/హుజూర్‌నగర్, ఫిబ్రవరి 19: సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఎన్నిక కోసం తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఏర్పాటు చేసిన అడ్‌హాక్ కమిటీ ఈ నెల 16న కోదాడ జూనియర్ కళాశాలలో ఎలాంటి జనరల్ బాడీ సమావేశాన్ని, ఎన్నికలను నిర్వహించలేదని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ చైర్మన్ ఆర్.భూలోకరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాన్ని, ఎన్నికలు నిర్వహించేందుకు స్థానిక ప్రభుత్వ అధికారులు అనుమతించలేదని తెలిపారు. ఈ నెల 16న హుజూర్‌నగర్ రిటర్నింగ్ అధికారి నూతన జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఎన్నికకు సంబంధించి చేసిన ప్రకటన చెల్లదని పేర్కొన్నారు. కబడ్డీ అసోసియేషన్‌కు రిటర్నింగ్ అధికారి ప్రకటించిన కొత్త ఆఫీస్ బేరర్లు, ఎగ్జిక్యూటివ్ బాడీకి గుర్తింపు లేదని వివరించారు. జిల్లాలో కబడ్డీ కార్యకలాపాల నిర్వహణకుఅడ్‌హాక్ కమిటీ పని చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.

రైతు నుంచి నగదు అపహరణ

అనంతగిరి, ఫిబ్రవరి 19: రైతు ఆరుగాలం శ్రమించి సంపాదించుకున్న డబ్బును గుర్తు తెలియని వ్యక్తులు కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోండ్రియాల గ్రామానికి చెందిన కొండబాలు పుల్లయ్య ఇటీవల తాను పండించిన ధాన్యాన్ని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారికి అమ్మాడు. మంగళవారం మధ్యాహ్నం నేలకొండపల్లిలో వ్యాపారి నుంచి ధాన్యం డబ్బులు రూ.1,77,817 తీసుకొని టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై గోండ్రియాలకు బయలుదేరాడు. మండలంలోని శాంతినగర్ గ్రామ శివారుకు రాగానే వెనుక నుంచి స్కూటీపై వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు పుల్లయ్య వాహనం ఆపి బెదిరించి, దాడి చేసి డబ్బులు లాక్కెళ్లారు. బుధవారం పుల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

కోడి పందేల నిర్వాహకులపై కేసు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 19: మండలంలోని కందులవారిగూడెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్న 8 మందిపై పోలీసులు బుధవారం కేసులు నమోదు చేశారు. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నామని, మరో ఇద్దరు పరారయ్యారని వెల్లడించారు. మొత్తం 8 మందిపై కేసు నమోదు చేసి రూ.4 వేల నగదు,6 మోటార్ సైకిళ్లు, 2 కోడిపుంజులు స్వాధీన పరుచుకున్నట్లు పేర్కొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలని ఆందోళన

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 19: జిల్లా కేంద్రంలోని 45వ వార్డులో పాత రామలింగేశ్వర థియేటర్ రోడ్డు నుంచి వనజ ఆసుపత్రి వరకు మున్సిపాలిటీ నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ వార్డుకు చెందిన పలువురు మహిళలు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ ప్రాంతానికి మున్సిపాలిటీ ద్వారా నీటి సరఫరా లేకపోవడంతో గతంలో వార్డు కౌన్సిలర్ గండూరి పావనీకృపాకర్ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశారని తెలిపారు. ప్రస్తుతం కౌన్సిలర్ పదవీ కాలం ముగియడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇటీవల నీళ్లిస్తామని చెప్పి 20 రోజుల క్రితం రోడ్డు తవ్వారని, ఇప్పటివరకు పైప్‌లైన్ వేయలేదని, వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో తమ సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు. రోడ్డును తవ్వడంతో ట్యాంకర్లు కూడా రాలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆందోళనలో ఉప్పల రాణి, పోతు రాజ్యం, రవ్వ శ్రీవిద్య, పోతు రాజా, కె.జానమ్మ, ఎస్.రాజేశ్వరి, రేష్మ, జి.సరస్వతి, రాములమ్మ, మేఘన తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ అడుగుజాడల్లో నడవాలి : ఎమ్మెల్యే సామేలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

తుంగతుర్తి, ఫిబ్రవరి 19: గిరిజనుల అభివృద్ధికి విశేష కృషి చేసిన సంత్ సేవాలాల్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో రూ.2 కోట్లతో బంజార భవన్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ దయానందం, ఎంపీడీఓ శేషుకుమార్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సోమ్లానాయక్, రాజారాం, జమ్మిలాల్, భాస్కర్, నర్సింహ, శ్రీను, సుధాకర్, నాగు పాల్గొన్నారు.

సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

గరిడేపల్లి, ఫిబ్రవరి 19: మండలంలోని రాయినిగూడెం గ్రామంలో బుధవారం నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సబ్ జూనియర్ జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ చైర్మన్ బి.భూలోకరావు, కన్వీనర్ కర్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల క్రీడలకు..

సూర్యాపేట టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాస్థాయి క్రీడాకారులను ఎంపిక చేసేందుకు బుధవారం స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, బి.రాంబాబు, శ్యాంసుందర్‌రెడ్డి, అమీర్‌ఖాన్, బి.వెంకన్న, ఎస్.యాదగిరి, ఎం.ఎస్.ఎన్.రాజు, చంద్రశేఖర్, భ్రమరాంబ, కృష్ణమాచార్యులు, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో అవినీతి జరిగిందని కలెక్టర్‌కు ఫిర్యాదు

గరిడేపల్లి, ఫిబ్రవరి 19: మండలంలోని రాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవినీతి జరిగిందని పీఏసీఎస్ రిటైర్డ్ అటెండర్ కమల్ల ఆంథోని బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాలకవర్గం తీర్మానం, సహకారశాఖ అనుమతులు లేకుండా సంఘం చైర్మన్ రూ.9 లక్షల నిధులను తన సొంత అవసరాలకు వాడుకున్నారని ఆరోపించారు. విద్యుత్ శాఖ వద్ద స్తంభాలు, తీగలు ఉచితంగా తీసుకొచ్చి తప్పుడు బిల్లులతో రూ.80 వేలు మాయం చేశారని, వెలిదండ గ్రామంలో ఎరువుల గోదాం, పాత ప్రహరీకి రూ.లక్షతో రిపేర్లు చేయించి రూ.6.62 లక్షలు ఎంబీ చేయించి పాలకవర్గం తీర్మానం లేకుండా స్వాహా చేశారని, ప్రతి నెలా ఖర్చుల పేరుతో రూ.70 వేలు గోల్‌మాల్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, ఈ విషయమై పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ వివరణగా కోరగా.. తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి 8 నెలలు అవుతున్నదని, సంఘంలో ఎలాంటి అవినీతి జరుగలేదని తెలిపారు. తనపై కొంతమంది కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

గ్రామాల్లో భూముల వివరాలను సేకరించాలి : తాసీల్దార్

సమీక్షలో మాట్లాడుతున్న తాసీల్దార్ ధ్రువకుమార్

చిలుకూరు, ఫిబ్రవరి 19: గ్రామాల్లో సాగు చేస్తున్న భూములను, సాగులో లేని వాటిని ప్రభుత్వ నిబంధనల మేరకు గుర్తించాలని తాసీల్దార్ ధృవకుమార్ అన్నారు. బుధవారం చిలుకూరులోని తాసీల్దార్ కార్యాలయంలో సాగు భూముల గుర్తింపుపై రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే సర్వే నంబర్‌లో కొంత సాగు భూమి ఉండి, మరికొంత సాగు కాని భూములను సైతం గుర్తించి వివరాలను నమోదు చేయాలని సూచించారు.కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ కరుణశ్రీ, వ్యవసాయాధికారి శ్రీధర్, ఆర్ఐలు సీతయ్య, శ్వేత, ఏఈఓలు చంద్రశేఖర్, శిరీష, వసీమా తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రాన్ని టీబీ రహితంగా మారుద్దాం'

మునగాల : శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ పుష్పలత

గరిడేపల్లి, ఫిబ్రవరి 19: రాష్ట్రాన్ని టీబీ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి వి.నరేశ్ అన్నారు. బుధవారం మండలంలోని మంగాపురం గ్రామంలో నిర్వహించిన నిక్షయ్ శివిర్ క్యాంపులో ఆయన మాట్లాడారు. శిబిరంలో 40 మందికి తెమడ, ఎక్స్‌రే తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. శిబిరంలో పీహెచ్ఎన్ శారద, సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, వైద్య సిబ్బంది అశోక్‌సాయి, మమత, పంచాయతీ కార్యదర్శి సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

మునగాల: క్షయ వ్యాధి నిర్మూలనకు ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాల్ అన్నారు. బుధవారం మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో మునగాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్లు రవీందర్, పుష్పలత 60 మంది నుంచి తెమడ శాంపిళ్లు సేకరించి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పిడమర్తి సైదులు, సుభాషిణి, సతీశ్, కార్యదర్శి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 19: వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కోదాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో బుధవారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన గూడెపు నాగేశ్వరరావు (48) అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం కోదాడని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుడు పరిశీలించి స్కానింగ్, రక్త పరీక్షలకు పంపించి పనిమీద బయటకు వెళ్లాడు. ఆ తర్వాత పరీక్షల రిపోర్టును కాంపౌండర్లు వాట్సాప్ ద్వారా వైద్యుడికి పంపించారు. అనంతరం వైద్యుడి సూచనల మేరకు కాంపౌండర్లు ఇంజక్షన్ చేయగా, అది వికటించి నాగేశ్వరరావు మృతిచెందాడు. కాగా, ఆసుపత్రి సిబ్బంది నాగేశ్వరరావుకు సీరియస్‌గా ఉందని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి సిబ్బంది పరీక్షించి మృతిచెందినట్లు తెలిపారు. దీంతో మొదట చికిత్స అందించిన ఆసుపత్రిలో అధిక డోసు ఇవ్వడంతోనే నాగేశ్వరరావు మృతిచెందాడని బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

'బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తమరావు

కోదాడ టౌన్, ఫిబ్రవరి 19: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్‌కు మద్దతు తెలిపి బీసీల సత్తా చాటాలని మున్నూరుకాపు అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పూటం పురుషోత్తమ రావు పటేల్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కోదాడలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల రామారావు నివాసంలో మున్నూరు కాపు, బీసీ సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలు 'ఓట్లు మావే-సీట్లు మావే' అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో పర్వత సతీశ్‌కుమార్, బత్తుల సిద్దేశ్వర పటేల్, పి.రామారావు, కస్తూరి రాములు, వీరయ్య, జగన్మోహన్‌రావు, రామకృష్ణ, ఆవుల వెంకటేశ్వరరావు, తుపాకుల భాస్కర్, తోట రంగారావు, రామిశెట్టి రామకృష్ణ, చంద్రమౌళి, కుందూరు వీరభద్రం, తాటికొండ సురేశ్, పసుపులేటి గోపి తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్:హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మున్నూరుకాపుల సమావేశంలో పురుషోత్తమరావు పాల్గొని మాట్లాడారు. బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. బీసీ నాయకులు ధూళిపాల శ్రీనివాస్, కోల నాగేశ్వర్‌రావు, రామారావు, శ్రీనివాసరావు, రాము పాల్గొన్నారు.

'పాఠశాలల అభివృద్ధికి సహకారం అభినందనీయం'

నేరేడుచర్ల, ఫిబ్రవరి 19: మండలంలోని దిర్శించర్ల ప్రాథమిక పాఠశాలకు ఇండిగో సేవా ఉత్సవ్ కంపెనీ ఆధ్వర్యంలో రూ.2 లక్షలు వెచ్చించి రంగులు వేయించారు. నేరేడుచర్ల పట్టణంలోని వెంగమాంబ ట్రేడర్స్ సౌజన్యంతో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ యూనియన్‌కు చెందిన పెయింటర్స్ 40 మంది ఉచితంగా రంగులు వేశారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛంద, వ్యాపార సంస్థలు చేస్తున్న సహకారం అభినందనీయమన్నారు. అనంతరం ఇండిగో మేనేజర్ సాగర్ మాట్లాడుతూ.. మారుమూల ప్రాంత పాఠశాలలను అభివృద్ధి చేయడమే ఇండిగో పెయింటింగ్ కంపెనీ లక్ష్యమని, ఇలాంటి పాఠశాలలు ఎక్కడైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సహకరిస్తామని తెలిపారు. ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఇండిగో సేవా ఉత్సవ్ కంపెనీ సేల్స్ అధికారి జీవన్, దిర్శించర్ల, నేరేడుచర్ల పాఠశాలల హెచ్ఎంలు బట్టు మధు, మామిళ్ల శ్రీనివాస రెడ్డి, సైదులు, పంగ వెంకన్న, కిరణ్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నప్రసాదం సరఫరాకు టెండర్లు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 19: మండల కేంద్రంలోని స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరుగనున్న మహాశివరాత్రి జాతర సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదం సరఫరా చేయడానికి ఆసక్తి గలవారు రూ.10 వేల ధరావత్‌తో 22వ తేదీ ఉదయం 11 గంటల వరకు టెండర్లు సమర్పించాలని ఆలయ ఈఓ కొండారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు ఆలయ సమీపంలో దుకాణాలకు స్థలం కేటాయించడానికి ఈ నెల 21న వేలం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నా భూమిని ఎస్ఐ పట్టా చేయించుకున్నారు

- మీడియా సమావేశంలో ఓ మహిళ ఆరోపణ

సమావేశంలో మాట్లాడుతున్న పుష్పలత

ఖైరతాబాద్, ఫిబ్రవరి 19: తాను కొనుగోలు చేసిన భూమిని ఓ ఎస్ఐ అక్రమంగా పట్టా చేసుకున్నాడని సూర్యాపేటకు చెందిన అములపురి పుష్పలత ఆరోపించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సూర్యాపేట కలెక్టర్ కార్యాలయం వెనుక తాను 2006లో ఓ వ్యక్తి వద్ద 347 గజాల స్థలం కొనుగోలు చేశానన్నారు. 2016లో ఎల్ఆర్ఎస్ కోసం కూడా దరఖాస్తు చేసున్నానని చెప్పారు. అయితే, తాను కొనుగోలు చేసిన వ్యక్తికి బంధువు వరుసయ్యే ముగ్గురు మహిళలు తన స్థలాన్ని కబ్జా చేశారని తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కలెక్టర్, తాసీల్దార్, టౌన్ ప్లానింగ్ తదితర అధికారుల వద్దకు వెళ్తే తనకు ఎలాంటి న్యాయం దక్కలేదన్నారు. 2021 అక్టోబర్‌లో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశానని, దీంతో అధికారులను వారు ప్రశ్నించి వెంటనే న్యాయం చేయాలని ఆదేశించారని చెప్పారు. తన తల్లిదండ్రులు చనిపోవడం వల్ల సూర్యాపేటలోనే ఒంటరిగా ఉంటున్నానని వెల్లడించారు. కాగా, 2022 డిసెంబర్ 29న సూర్యాపేట జిల్లా భజనతండాకు చెందిన ఓ ఎస్ఐ తన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. సదరు మహిళల వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పుకుంటున్నాడన్నారు. తన స్థలాన్ని కబ్జా చేసిన ఎస్ఐ, ఫేక్ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను కోరారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం : డాక్టర్ నాగిని


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగిని

నేరేడుచర్ల, ఫిబ్రవరి 19: పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యంగా జీవించొచ్చని నేరేడుచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి నాగిని అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు తినడానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ శారద, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ఆశ కార్యకర్తలు విజయరాణి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

'దానం చేసిన భూములను తిరిగి తీసుకోవడం సరికాదు'

నేరేడుచర్ల, ఫిబ్రవరి 19: మండలంలోని ఫత్తెపురం గ్రామ శివారులో 70 ఏండ్ల క్రితం దానం ఇచ్చిన భూములను నేడు వారి కుటుంబ సభ్యులు తిరిగి తీసుకోవాలని ప్రయత్నించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు అన్నారు. బుధవారం ఫత్తెపురం గ్రామంలోని ఆయా భూముల్లో నిర్మించిన ఇండ్లను సీపీఎం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు సర్వే నంబర్లలో సుమారు 150 మంది దళితులకు గత ప్రభుత్వాలు ఇండ్లు నిర్మించి ఇచ్చాయని తెలిపారు. అయితే, దానం ఇచ్చిన భూమిని ఇప్పుడు వారి కుటుంబ సభ్యులు తమది అనడం, కోర్టు ద్వారా నోటీసులు ఇప్పించడం సరికాదన్నారు. నోటీసులను ఉపసంహరించుకోకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోదమగుండ్ల నగేశ్, మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు, సోమయ్య, వెంకటయ్య, శ్రీధర్, దేవయ్య, శ్రీను, సైదులు, వెంకయ్య, భిక్షం, మల్లారెడ్డి, శేఖర్ రెడ్డి, సత్యం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరేడుచర్ల, ఫిబ్రవరి 19: మండలంలోని దిర్శించర్ల, ముకుందాపురం 33 కేవీ సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్నందున గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ పందిరి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

'మిర్చి రైతులకు రూ.25 వేల మద్దతు ధర కల్పించాలి'

చింతలపాలెం, ఫిబ్రవరి 19: మిర్చి రైతులకు క్వింటాకు రూ.25 వేల మద్దతు ధర కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో తాసీల్దార్ సురేందర్‌రెడ్డికి రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు మిర్చిని నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వ కోల్డ్ స్టోరేజ్‌లు లేకపోవడంతో ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారని, యాజమాన్యాలు మిర్చి బస్తాలకు ఇష్టానుసారంగా ధరలు పెంచడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రైవేట్ కోల్డ్ స్టోరేజ్‌ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి రైతులపై భారం తగ్గేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు సుందర మౌళేశ్వర రెడ్డి, సైదులు, పుల్లయ్య, గోవిందరెడ్డి, జానిమియా, వెంకన్న, మంగయ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పరీక్ష సామగ్రిని అందజేస్తున్న క్లబ్ సభ్యులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 19: మండలంలోని పొనుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు పూర్ణచంద్రారెడ్డి ఆర్థిక సహకారంతో బుధవాం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పూర్ణచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు నర్సకుమారి, క్లబ్ సభ్యులు యూసఫ్, విశ్వనాథ్, నాగేశ్వరరావు, బుద్ధారెడ్డి పాల్గొన్నారు.

'ఎస్సారెస్పీ కాల్వలకు గండ్లు పెడితే చర్యలు'


సమావేశంలో మాట్లాడుతున్న తాసీల్దార్ శ్రీనివాస్‌రావు

నూతనకల్, ఫిబ్రవరి 19: ఎస్సారెస్పీ కాల్వలకు రైతులు గండ్లు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ సునీత అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సారెస్పీ కాల్వలు, మిషన్ భగీరథ పథకంపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అన్నారు. మిషన్ భగీరథ నీటితో పాటు అద్దె మోటార్ల ద్వారా నీటి సమస్య ఉన్న గ్రామాల్లో తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్సారెస్పీ జలాలు చివరి ఆయకట్టు వరకు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

'రైతుల సమస్యల పరిష్కారంలో విఫలం'

గరిడేపల్లి, ఫిబ్రవరి 19: రైతుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు విమర్శించారు. కొర్రీలు లేకుండా రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని కోరుతూ బుధవారం ఏఓ త్రివేణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, కుందూరు వెంకటరెడ్డి, పంగ సైదులు, లింగరాజు, ఖాసీం, రామాచారి, రామచంద్రయ్య, సైదులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 19: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ముత్తయ్య సూచించారు. బుధవారం పట్టణంలోని డీబీ పాఠశాల విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలను తీసుకోవడం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మత్తుతో జీవితం చిత్తవుతుందని అన్నారు. విద్యార్థులు చదువుపైన దృష్టి పెట్టి జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.